## క్లుప్తంగా

### మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** మంత్రి అమర్‌నాథ్‌కు స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 68వ వార్డు మింది‌లోని మంత్రి నివాసంలో మంగళవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా గతేడాది తొలి ఏడు నెలల్లో రాష్ట్రం భారీ పెట్టుబడులు సాధించగలిగిందన్నారు. జనవరి నుంచి జూలై వరకు దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలిచిందన్నారు. మంత్రిని కలిసిన వైఎస్సార్ టీయూసీ నాయకులు వై.మస్తానప్ప, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి, జి. అప్పలరాజు, పిట్టా రెడ్డి, తోకాడ అప్పారావు, ములకలపల్లి వెంకటేష్, వెంకటరావు తదితరులున్నారు.

### నమ్మిన సిద్ధాంతం కోసం జీవించిన నేత పీవీ



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**గాజువాక:** నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు కష్టపడి పని చేసిన నేత పీవీ చలపతిరావు అని బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. గాజువాక బీజేపీ కార్యాలయంలో పీవీ చలపతిరావుకు మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర తొలి అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా ఆయన అందించిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో సత్సంబంధాలు కలిగిన నాయకుడు చలపతిరావు అని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బొండా శ్రీదేవి, కట్టా పద్మ, గీతాసింగ్, ప్రసాద్‌శర్మ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్యానళ్లకు గుర్తుల కేటాయింపు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మూడు ప్యానళ్లకు గుర్తులు కేటాయించారు. ఒకటో ప్యానల్‌కు పుస్తకం, రెండో ప్యానల్‌కు రింగ్, మూడో ప్యానల్‌కు దువ్వెన గుర్తు కేటాయించినట్లు స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రిటర్నింగ్ ఆఫీసర్ జె.వి.రావు తెలిపారు. నాన్ వర్క్స్ ఉద్యోగులకు ఎల్ అండ్ డీసీ విభాగంలో, వర్క్స్ డివిజన్ ఉద్యోగులకు క్యూఏటీడీ విభాగంలో పోలింగ్ నిర్వహిస్తామని తెలియజేశారు.

### వెంకన్నగా దర్శనమిచ్చిన అప్పన్న



వేంకటేశ్వరస్వామి అలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

**సింహాచలం:** సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి మంగళవారం వేంకటేశ్వర స్వామి అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వెంకన్నగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠంపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.



# ఆదర్శ మహిళ 'సావిత్రి బాయి పూలే'

- అతివల అక్షరాస్యత కోసం ఆమె చేసిన కృషి మరువలేం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



హెచ్‌ఎం లక్ష్మీకాంతంను సత్కరిస్తున్న ఉపాధ్యాయినులు



సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

**పెదగంట్యాడ:** దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయినిగా సావిత్రి బాయి పూలే చేసిన సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. మహిళల్లో అక్షరాస్యత కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సావిత్రి బాయి జయంతి సందర్భంగా బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, ఎన్నేటి రమణ, గొందేశి మహేశ్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోమటి రమాదేవి, యువశ్రీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

**కోరాడ జంక్షన్‌లో..**

జీవీఎంసీ 75వ వార్డు కోరాడ జంక్షన్‌లో జాగారపు శ్రీను ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్ర పటానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, తోకాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రధానోపాధ్యాయినికి సత్కారం**

**గాజువాక:** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయినులు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని లక్ష్మీకాంతంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే మహిళల అక్షరాస్యత కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, 52 పాఠశాలలను స్థాపించి లక్ష్యం కోసం పని చేశారన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, మహిళల శిరోముండనానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే పరశురామ్, కరస్పాండెంట్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

**మహిళా లోకానికి విద్యాప్రదాత**

**అగనంపూడి:** మహిళా లోకానికి విద్యాప్రదాత సావిత్రిబాయి పూలే అని లయన్స్‌క్లబ్ విశాఖ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతరావు, ఉక్కు కార్మిక సంఘం నాయకుడు బలిరెడ్డి సత్యనారాయణ అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా అగనంపూడి నిర్వాసిత కాలనీ శనివాడ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.రాణి, చిట్టి సుజాత, మహిళా సంఘం నాయకురాలు శ్రీనమ్మ, అమ్మాజీ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న నాయకులు

- 79వ వార్డు పాత అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు. సంఘ ప్రతినిధి చిత్తా రామారావు, వివిధ పార్టీల నాయకులు చిత్తా చిన్న, కరణం పైడిరాజు, సింగిడి సింహాచలం, కోసూరి తాతారావు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయినులకు సావిత్రిబాయి అవార్డులు



ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే అవార్డుల ప్రదానం ఘనంగా జరిగింది. సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఓబీసీ కార్యాలయంలో మంగళవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఎనిమిది మంది ఉపాధ్యాయినులు కస్తూరి మణి, వరలక్ష్మి, సుచిత్ర, అరుణ, బి. నిర్మల, ఎం. పార్వతిదేవి, కిరణ కుమారి, డి. శాంతి కుమారిలను అసోసియేషన్ అధ్యక్షులు కోమటి రవిశంకర్, ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో ఆమె విద్యనభ్యసించి, దేశంలో మహిళా విద్య వ్యాప్తికి ఎంతగానో కృషి చేశారన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ సావిత్రి బాయి పేరిట అవార్డులు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సంఘం నాయకులు నమ్మి తాతారావు, పిల్లి చంద్రరావు, నెల్లి అప్పలరాజు, వి.ఎం. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ పాకెట్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ నూతన సంవత్సర పాకెట్ డైరీని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ఆవిష్కరించారు. ఉక్కు పరిపాలన భవనంలోని సీఎండీ కార్యాయలంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభ్యులందరికీ మంచి సేవలందిస్తున్న సొసైటీ, భవిష్యత్తులోనూ ఇదే విధంగా పని చేసేలా కార్యవర్గం బాధ్యత తీసుకోవాలని సూచించారు. పాలకవర్గం ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఏడాది త్రిఫ్ట్ పాకెట్ డైరీ, ఐడీ కార్డు పౌచ్‌తో పాటు ఏటీఎం కార్డు పౌచ్‌ను అదనంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనందకుమార్, కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి కొండరాజు, డైరెక్టర్లు కె. శ్రీనివాస్, ఎం.వి. రమణ, బి. లాలూ, జి.వి. రమేష్, గౌతమ్ మహీధర్ పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతా నుంచి రూ.1.3 లక్షలు మాయం

**కూర్మన్నపాలెం:** తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమవుతున్నాయని ఉక్కు ఉద్యోగి దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రాయి అప్పారావు గత నెల 29వ తేదీన కూర్మన్నపాలెం కూడలిలో ఉన్న మోర్ సూపర్ మార్కెట్ పక్కన గల ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేశారు. అప్పటి నుంచి అప్పారావు బ్యాంకు ఖాతా నుంచి దఫదఫాలుగా మొత్తం 1 లక్ష 30 వేల రూపాయలు మాయం అయ్యాయి. దీంతో ఆందోళన చెందిన బాధితుడు దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసే సమయంలో తన పక్కన ఓ మహిళ ఉందని, ఆమె తన ఏటీఎం కార్డును మాయం చేసి డబ్బులు తీసుకుంటున్నట్లు అనుమానం ఉందని అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. దువ్వాడ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## రోగులకు ఆర్థిక సాయం



బాధితునికి నగదును అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**అగనంపూడి:** దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు రోగులకు అగనంపూడి శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం, ఇంటర్నేషనల్ పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఆర్థిక సాయం అందించింది. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాధిగ్రస్తులు రాజేశ్వరి, పద్మలకు వైద్య ఖర్చుల నిమిత్తం చెరో రూ.ఐదు వేల నగదును ప్రతినిధులు అందించారు. సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి చిక్కాల సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పప్పు రాజారావు, అధ్యక్షుడు రాపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ బాలలకు అన్న వితరణ



బాలలకు అన్నం వడ్డిస్తున్న కృష్ణారావు

**అక్కిరెడ్డిపాలెం:** అనాథ బాలలకు దాతలు అన్న వితరణ చేశారు. సూపర్ బజార్ మాజీ చైర్మన్, గాజువాక పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జి.వి. నాయుడు వర్ధంతి సందర్భంగా, పంతులు గారి మేడ వద్ద గల స్ఫూర్తి అనాథాశ్రమంలో చిన్నారులకు ఆయన కుమారుడు మాజీ కార్పొరేటర్ జి.వి. కృష్ణారావు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంద్రాన గోవింద్, కిశోర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## భెల్ ఈడీని కలిసిన హెచ్‌బీఎస్ కమిటీ



ఈడీ జితేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

**అక్కిరెడ్డిపాలెం:** భెల్ (హెచ్‌పీవీపీ) ఈడీ జితేందర్ రెడ్డిని బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ (హెచ్‌బీఎస్) 3వ ఫేజ్ విశ్రాంత ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ పరిపాలనా భవనంలో ఈడీ ఛాంబర్‌లో ఆయన్ను కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 3వ ఫేజ్ గృహ నిర్మాణం విషయంలో మేనేజ్‌మెంట్ సహాయ సహకారాలపై స్పందించాలని కోరారు. ఈడీని కలిసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రతినిధులు రామారావు, పి.శంకర్రావు, డి.పార్వతీశం, గొంది నవీన్ తదితరులున్నారు.

## నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

**గాజువాక:** చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలోని గొంతినవానిపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డీఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా గొంతినవానిపాలెం, సనత్‌నగర్, ప్రశాంతినగర్, మెహర్‌నగర్, నాయుడోరు వీధి, జగ్గు జంక్షన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

# కానరాని 'చెత్త' శుద్ధి..!

- ఇష్టానుసారం డంపర్‌బిన్ల ఏర్పాటు
- అస్తవ్యస్తంగా రహదారి



చిననడుపూరు వుడా కాలనీ మధ్యలో ఒకే చోట ఉన్న రెండు డంపర్ బిన్లు

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 73వ వార్డు పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసిత ప్రాంతాల్లో, ప్రధాన రహదారుల్లో ఈ విధంగా డంపర్‌బిన్లు వదిలేయడంపై విమర్శిస్తున్నారు. వార్డు పరిధిలోని చిన నడుపూరు, వుడా కాలనీ మధ్య ప్రధాన రహదారిలో ఒకే చోట రెండు డంపర్ బిన్లు ఏర్పాటు చేశారు. కానీ వాటిని సక్రమంగా కాకుండా, ఇష్టం వచ్చినట్లుగా పక్కకు పడేశారు. ఇక చేసేదేం ఉంది? చెత్త ఎక్కడ వేస్తే ఏముంది అనుకుంటున్నారో ఏమో జనం మాత్రం తమ ఇళ్లలోని చెత్తను తీసుకొచ్చి రోడ్డుపై ఇలా పారబోస్తున్నారు. దీంతో ఈ రోడ్డు పందులకు ఆవాసమైంది. చెత్తాచెదారాన్ని చెల్లాచెదురు చేసి రోడ్డంతా అస్తవ్యస్తం చేసేస్తున్నాయి. ఇదేదో ఒక్కరోజు జరుగుతున్నది కాదు, నిత్యం ఇలాగే ఉంటుందీ పరిస్థితి అని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## నిర్వాసితుల నిరాహార దీక్ష నేడు

**అగనంపూడి:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అగనంపూడి కూడలిలో 24గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టేందుకు నిర్వాసితులు నిర్ణయించారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి గురువారం ఉదయం (5వ తేదీ) 8గంటల వరకు దీక్ష కొనసాగుతుందని నిర్వాహకుడు దాసరి త్రినాథ్ తెలిపారు. కార్మికులు, నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు అగనంపూడిలోని ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని దీక్షకు మద్దతునిచ్చి, విజయవంతం చేయాలని కోరారు.

### క్రీడలు - శిక్షణ

## జాతీయ స్థాయి పోటీల్లో మెరిసిన డీఏవీ విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ సంజీవరావు, హెచ్‌ఎం మీనా రోని

**ఉక్కునగరం:** జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఉక్కు డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, పలు పతకాలు సాధించారు. పంజాబ్‌లోని జలంధర్ విశ్వవిద్యాలయంలో గత నెల 28 నుంచి 31 వరకు డీఏవీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డీఏవీ సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం గెలుపొందింది. ఈ జట్టులో ఉక్కు డీఏవీ విద్యార్థులు సిహెచ్. మోక్షజ్ఞ, జి. మోనికా శ్రీవల్లి, ఝాన్సీలక్ష్మిలకు బంగారు పతకాలు లభించాయి. అదే విధంగా అండర్–19 బాక్సింగ్ బాలికల పోటీల్లో పాఠశాల విద్యార్థిని కె. కనకదీప కాంస్య పతకం గెలుపొందింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను, పీఈటీ మల్లేశ్వరరావును స్కూల్ చైర్మన్ కె. సంజీవరావు, ప్రధానోపాధ్యాయిని మీనా రోని అభినందించారు.

# పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

**పెదగంట్యాడ:** పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 64వ వార్డు పరిధి యారాడలోని రామాలయం వీధి, బస్టాపు వీధి, శెట్టిబలిజ వీధిలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలను సేకరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మరోమారు దరఖాస్తు చేయించి పథకాలను అందజేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు అక్కడి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మంచినీటి బోర్లు వేయించాలని కోరడంతో, స్పందించిన ఆయన వెంటనే ఐదు బోర్లు వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీఈ అప్పారావు, నాగోతి మధు, బంక వాసు, పిల్లా అచ్చారావు, బంక రాము, చీపుర్ల వెంకట అప్పారావు, నాగోతి పార్వతి, లలిత, బంక చంద్రరావు, భరత్, నాగోతి సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్న వేంకటేశ్వరుడికి దీప హారతి





పూజలందుకున్న ప్రసన్న వేంకటేశ్వరుడు, స్వామికి దీప హారతి ఇస్తున్న భక్తులు

**అక్కిరెడ్డిపాలెం:** బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న గిరిపై కొలువైయున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామికి భక్తులు దీపహారతి సమర్పించారు. మంగళవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని, పాశుర విన్నపం చేశారు. స్వామి సన్నిధిలో సహస్ర దీపార్చన, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

**సెక్టార్–1లోని వెంకన్న ఆలయంలో..**



స్టీల్‌ప్లాంట్‌లోని ఆలయంలో దీప హారతి ఇస్తున్న భక్తులు

**ఉక్కునగరం:** స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం కుత్తువిళక్ పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు, భక్తులు దీపాలతో హారతి ఇచ్చి స్వామికి పాశుర విన్నపం చేశారు. అంతకు ముందు తెల్లవారుజామున 4 గంటలకు వెంకటేశ్వర స్వామి, గోదాదేవికి సుప్రభాత సేవ, సేవాకాలం నిర్వహించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తీరు దారుణం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** విశాఖ ఉక్కు పరిశ్రమ తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలుగు వారికి అభ్యంతరాన్ని కలిగిస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 691వ రోజు మంగళవారం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి, బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయని, త్వరలోనే ప్రధానిని కలిసి అభ్యంతరం తెలుపుతామని చెప్పారు. ఈ నెల 30న నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనలో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కుటుంబాలతో కలిసి పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అగనంపూడి నిర్వాసిత కాలనీలో బుధవారం 24గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టి.ఎస్.ఎన్.పి.వెంకటేష్, జి.వి.ఎస్. రంగప్రసాద్, ఎం.ఏ. రాజు, టి.సురేష్, ఎం.వి. రమణ, పూర్ణచంద్రరావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# మద్యం వల్ల అనర్థాలపై పోస్టర్ల ప్రదర్శన

కోర్టు తీర్పు మేరకు మందుబాబుల సామాజిక సేవ



పాతగాజువాక కూడలిలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న మందుబాబులు

**అక్కిరెడ్డిపాలెం:** మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలపై పోస్టర్లను ప్రదర్శించారు మందుబాబులు. గాజువాకలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారు కోర్టు తీర్పు ప్రకారం ఈ విధంగా సామాజిక సేవలో పాల్గొన్నారు. వివరాలివి.. గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్, కొత్తగాజువాక బీసీ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించగా, 29మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా, 3వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జడ్జి కె.భారతి తీర్పును వెల్లడించారు. వారిలో 18 మందికి జరిమానాతో పాటు 1 గంట కమ్యూనిటీ సర్వీస్ చేయాలని ఆదేశించారు. పాతగాజువాక జంక్షన్‌లో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కమ్యూనిటీ సర్వీస్ చేయించామని సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మిగిలిన వారికి రూ.2000 చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

# ఎఫ్‌బీఎస్ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేస్తున్న సిటూ నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** భెల్‌లో ఈ నెల 11న ఫ్యామిలీ బెనిఫిట్స్ సొసైటీ (ఎఫ్‌బీఎస్) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 408 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సీఐటీయూ ప్యానల్ నుంచి పోటీ చేస్తున్న జి.రాంబాబు, ఎస్.అప్పారావు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి వి.వి.శారదారావుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.